# మధుర భావన-11

తల్లిని చూసి రావటానికని అనూష వంశీతో బయలుదేరింది. తల్లి తననీ గుర్తుపట్టనట్లుగా నిర్లిప్తంగా చూసేసరికి ఆమె కోపం తారాస్థాయికి వెళ్లింది.

‘‘ఏమిటమ్మా ఇది...? అన్నయ్యని అంటే సరే, ఏదో అనుకోవచ్చుగానీ, నన్ను... కన్నబిడ్డని కూడా ఎవరన్నట్లు చూస్తావేం...? నీకిలాంటి పరిస్థితి దాపురించటానికి కారణం ఏమిటమ్మా...? మనసుకు గాయమవటం ఏమిటి చెప్పూ...’’ అంటూ నిలదీస్తున్నట్లు పెద్ద గొంతుతో హడావుడి చేసింది.

ఆ కేకలకు శారద, తనూజ లోపలనుండి వచ్చారు.

‘‘ఆమెను ప్రశాంతంగా ఉండనివ్వండి. ఎందుకంత గట్టిగా మాట్లాడుతున్నారూ...?’’ అని అనూషను హెచ్చరించేసరికి తనకి కోపం ఇంకా పెరిగిపోయింది!

‘‘ఏమిటీ... నేను... ప్రశాంతంగా ఉండనివ్వటంలేదా... నేనెవరో మీకు తెలుసా? ఆవిడ నా కన్నతల్లి! ఆమె మనసుకు ఎందుకు గాయమైందో తెలుసుకునే హక్కు నాకు లేదా? ఆ హక్కు... నాకు... నాకు మాత్రమే ఉంది! నాకు... ఏ విషయమైనా తెలియాలి!’’ మళ్ళీ గట్టిగా అరిచినట్లుగా అంది అనూష.

శ్యామసుందరి బెదిరినట్లుగా అయోమయంగా బిత్తర చూపులు చూసింది.

‘‘ఇది హాస్పిటల్... ఆమె మా పర్యవేక్షణలో ఉన్నారు! మీరు... దయచేసి ఇక్కడనుండి వెళ్ళిపోవటం మంచిది. మరోసారి దయచేసి రాకండి. కుదుటపడుతున్న ఆవిడ ఆరోగ్యం మళ్ళీ చెదరిపోయే పరిస్థితిని రానివ్వకండి!’’ శారద చెప్పిన సూచనను బలపరుస్తున్నట్లుగా తనూజ తలవూపింది.

అనూషకు అది చిన్నతనంగా అనిపించింది.

ఇంటికి వచ్చాక అనూషకు పొగలూ, సెగలూ ఇంకా పెరిగిపోయాయి! ఎవరిమీదో తెలియకుండా ఒక్కసారిగా మాటలతో విరుచుకుపడింది.

‘‘మా అమ్మ దగ్గిర నన్ను ఉండనివ్వరా...? ఎంత డాక్టర్లయితే మాత్రం... అంత ధైర్యమా వాళ్ళకు...? కన్నకూతురినే మరోసారి రాకండని హెచ్చరిస్తారా...? ఏం చేసినా, ఏం చెప్పినా చెల్లుబాటు

అవుతుందనుకుంటున్నారా...? అన్నిటికీ కలిపి బిల్లు వేస్తారుగానీ దయాదాక్షిణ్యాల మీద వాళ్ళేం వైద్యం చేయటం లేదుగదా...?''

అనూష దూకుడుగా అలా అరుస్తున్నట్లుగా మాట్లాడుతోంటే అనూష అత్తగారు అనునయంగా ఏదో చెప్పబోతుంటే... అనూష ఆవిడ మీదా విరుచుకుపడింది. ''మీరు కల్పించుకోకండి, నేను మాత్రమే ఆవిడ కడుపున పుట్టిన బిడ్డను ! నా బాధ మిగతా వాళ్ళకి ఎందుకు అర్థమౌతుంది? నేను అరుస్తున్నానని అనుకుంటున్నారు గానీ దాని వెనకున్న నా ఆవేదన మీకెలా తెలుస్తుందీ! మీలా నిదానంగా ఏం పట్టనట్లు నేనుండగలనా...? ''

అనూష భర్త కూడా ఏం మాట్లాడకుండా మౌనంగా ఉండిపోయాడు.

వంశీకి అనూష ధోరణి అంతు బట్టలేదు...తను అమ్మకు స్వంతకొడుకు కాదని ఎందుకు అనూ పదేపదే గుర్తు చేస్తోంది...? తనని పరాయివాడిగా చేయడంలో ఏదైనా ఆలోచన ఉందా...?

అతను... విమూఢిడిలా నిర్లిప్తంగా చూస్తుండిపోయాడు.

కాసేపటికే అనూష తమ ఊరుకు ప్రయాణం కట్టింది.

అత్తగారు అనూషతో ''నువ్వు మీ అన్నయ్యకు కొంచెం తోడుగా ఉండి, తర్వాత రావచ్చుగా... ఇంత వెంటనే మాతోనే బయలుదేరి వచ్చెయ్యటం దేనికీ...?'' అంది మెల్లగా.

అనూష మాత్రం వంశీ వైపు నిర్లక్ష్యంగా చూసి వ్యంగ్యంగా అంది ''ఇక్కడ ఉండి నే చేయాల్సినదేమీ కనిపించటం లేదు. అమ్మ దగ్గర ఉండొద్దంటూ ఆ డాక్టర్లు ఆంక్షలు పెట్టారు. ఇంట్లో ఉండి వంటా వార్పు చూడాల్సిన అవసరమూ లేదు. పార్వతి అన్ని పనులూ చక్కబెట్టేస్తోంది! ఎందుకూ, దండగగా ఇక్కడ నేను పడి ఉండటం...?''

ఎవరూ సమాధానం చెప్పలేదు.

అనూష, అత్తా భర్తతో వెళ్ళిపోవటం ఒక విధంగా వంశీకి వూరటగానే అనిపించింది.

'అవును... అనూష తన బాధకి స్వాంతనగా మాట్లాడటం లేదు. సరికదా ఇంకా పెరిగే విధంగా ఎత్తిపొడుస్తోంది....!' వంశీ ఆలోచనలు అలా సాగాయి!

‘అనూష కొత్తగా తల్లికి తను మాత్రమే స్వంతం అన్నట్లుగా దూకుడుగా... ఎందుకు అలా మాట్లాడుతోంది...? ఎపుడూ లేనిది అలాంటి అభిప్రాయం అకస్మాత్తుగా ఎందుకేర్పడింది...?’

వంశీకి ఏం అర్థంకాలేదు... అయోమయంగా అనిపించింది.

* * *

సుమజ వంశీకి రెండు మూడు సార్లు ఫోను చేసింది గానీ అతను మామూలుగా లేడనీ, తల్లి అనారోగ్యంతో ఉండటం వలన ఆ బాధతో తల్లడిల్లుతున్నాడనీ గ్రహించిన ఆమె, సరదా సంభాషణలతో సాగనీయక కేవలం క్షేమసమాచారాల కబుర్లుతోనే ముగించేసింది.

అనూష ఫోనుచేసి వంశీ తో ‘‘ఏం ఆలోచించావు...?’’ అనడిగింది.

సరిగా అర్థంకాక వంశీ ‘‘దేని గురించి...?’’ అంటూ ఆరా తీశాడు.

‘‘నీ పెళ్ళి గురించి...!’’ క్లుప్తంగా జవాబు చెప్పింది.

అతను నిట్టూర్చాడు.

‘‘అమ్మ నన్ను గుర్తుపట్టి... మామూలుగా ఆరోగ్యవంతురాలు కావటమే ప్రస్తుతం... నా కోరిక, ఆ తర్వాతనే పెళ్ళి ఆలోచన!’’ వంశీ మరో ఆలోచన లేకుండా బదులు చెప్పాడు.

‘‘ఎప్పటికి అమ్మకి ఆరోగ్యం కుదుటపడతుందనేది సరిగా తెలియకపోతే...?’’

‘‘అప్పటివరకూ వేచి చూడటమే... అమ్మ హాస్పిటల్ లో ఉండగా నేను పెళ్ళి పీటలపై కూర్చోవటమనేది జరగనే జరగదు!’’ వంశీ ఖచ్చితంగా చెప్పేసరికి... ఈసారి అనూష గట్టిగా నిట్టూర్చింది.

‘‘నీ మాటలు నాకేం నచ్చలేదు. నేనో మాట చెబుతాను... వింటావా?’’ అంది.

‘‘ముందు చెప్పు...’’

‘‘ఏం లేదూ... ఆ డాక్టరు గారు నీకు బాగా తెలిసినవారేకదా... అమ్మకేం అనారోగ్యం లేదనీ, ఇపుడు బాగానే ఉందన్నట్లుగా ఒక సర్టిఫికెట్ ఇమ్మని మనం అడిగితే కాదనరుగా...?’’

ఆ ప్రశ్నకు వంశీ కొంచెం అయోమయంగా ''ఎందుకు అలా అడగటం... దానివలన మనకేం ప్రయోజనం...?'' అనడిగాడు.

''అపుడు... అపుడు... అమ్మని ఇంటికి తీసుకువచ్చి నువ్వు పెళ్ళిచేసుకోవటం బావుంటుందిగా''

వంశీ నిట్టూర్చాడు.

''చెప్పానుగా అనూ, అమ్మ ఎప్పటిలా మామూలుగా ఉన్నపుడు నేను ఆనందంగా పెళ్ళి చేసుకోగలను గానీ, డాక్టరు దగ్గర్నుండి దొంగ సర్టిఫికెట్ సంపాదించటం... దేనికోసం ? ఎవర్ని మభ్య పెట్టటానికీ...?'' అంటూ వంశీ నిర్లిప్తంగా నిట్టూర్చాడు.

''అదేమిటలా అంటున్నావు? నీ పెళ్లిలోనే కదూ, నాకు కానుకగా, ఆడబడచు లాంఛనంగా... ఆ స్థలం ఇస్తానన్నావూ...?'' అనూష దీర్ఘం తీసింది.

వంశీ ఆశ్చర్యంగా ''అవునూ.. ఇపుడేం కాదనటం లేదుగా...?'' అన్నాడు.

''అబ్బా... నీకెలా చెప్పాలో నాకు తెలియటం లేదు. ఆ స్థలం నీకు చెందేది అయినా అమ్మపేరు మీదనే ఉందికదా... మానసిక ఆరోగ్యం సరిగా లేని సమయంలో అమ్మ ఎవరికీ దానిని రాయటం జరగకూడదట! ఈ విషయం నాకు తెలిసింది! అందుకని... అమ్మకేం మానసిక అనారోగ్యం లేదని ఆ సైకియాట్రిస్టు దగ్గర్నుండి ఓ సర్టిఫికేట్ తీసుకుంటే... అపుడు రాయటం కుదురుతుంది కదా....!''

వంశీ విస్మయం నుండి తేరుకోవటానికి కొంచెం సమయం పట్టింది. ఆశ్చర్యం నిండిన గొంతుతో ''అంత తొందరదేనికి అనూ...! ఆ స్థలం నీకు ఇవ్వటానికి అభ్యంతరం లేదని చెప్పాంగా...!'' అన్నాడు.

''ఇస్తామని నోటిమాటగా అంటే సరిపోతుందా...? అందులో మేం బిల్డింగ్ కట్టించుకోవటానికి ఎంత సమయం పడు తుందీ... ఎన్ని తతంగాలు ఉంటాయి...? ఆ పైన నీకు అన్నీ నచ్చిన సంబంధం... ఆ అమ్మాయి తరుపువాళ్ళు నువ్వు ఎప్పటికి సరేనంటావో తెలియకుండా ఎదురుచూస్తూ వూరుకుంటారా? నిన్నూ తొందర పెడతారుగా, అందుకే నేనూ మంచి సంబంధం చేజారిపోకుండా... పెళ్ళి జరిపించేద్దామని చూస్తున్నాను... పనిలో పనిగా ఆ స్థలం కూడా అమ్మచేత రాయించి నాకు ఇచ్చేయి! అన్ని బాధ్యతలూ తీరిపోతాయి!''

వంశీకి కోపం తన్నుకు వచ్చింది. అనూష అంత తొందరపడుతున్నది నిజంగా తన పెళ్ళి గురించా... లేక ఆ స్థలం తనకి దక్కించుకోవాలనా...? అతనికేం అర్థం కాలేదు. మొదటిసారిగా తల్లి భావించినట్లుగా 'అనూషను స్వార్థం బాగా ఆవరించేసిందా...' అనిపించి అతను విస్తుపోయాడు.

''అనూ... సుమజా వాళ్ళు అమ్మ ఆరోగ్యవంతురాలయ్యే వరకూ వేచి చూడటం కుదరదని చెప్పారే అనుకుందాం... అపుడు కూడా... నాకు నచ్చని విషయానికి నేను నిర్మొహమాటంగా 'కాదు' అనే చెబుతాను! నీకయినా సరే.. అదే నా సమాధానం! వేచి ఉండాల్సిందే!''

అనూష స్వరంలో కొంచెం మార్పు వచ్చింది. అసహనం తగ్గి, అనునయం వచ్చింది.

''అన్నయ్యా... నేనూ నాన్న మాటను నెరవేరుస్తాను! మేం కట్టబోయే ఆ ఇంటికి 'మధురభావన' అనే పేరే పెడదామనుకుంటున్నాను తెలుసా? కనుక నువ్వు నాన్నకోరికను తీర్చలేకపోతున్నామోనని అనుకోవద్దని చెబుతున్నాను!''

వంశీ చిన్నగా నవ్వాడు.

''ఆ ఇంటికి నాన్న 'మధుర భావన' అనే పేరు ఎందుకు పెట్టమని సలహా ఇచ్చారో అర్థమైందా అనూ...? అదో అందమైన పేరని మాత్రమే కాదు, అందరి మనసులలో మంచి భావనలు నిండి ఉండాలని, అది ఆనందమయ జీవితానికి సంకేతంగా అనిపిస్తుందనే ఉద్దేశ్యంతో మాత్రమే! తెలుసా...?'' అన్నాడు వంశీ.

''ఎందుకు తెలియదూ.. బాగానే తెలుసు... అమ్మా, నువ్వూ ఏమిటో నాన్న అభిప్రాయాలు మీకే బాగా అర్థమవుతాయని అనుకుంటారు...!'' నీలుగుతున్నట్లుగా మాటలు సాగదీస్తూ నిట్టూర్చింది.

వంశీ ఏదో అనబోతోంటే... అనూష అంది ''సరేలే.. ఒక విషయం బాగానే చెప్పావు... అమ్మ చేత నాకు ఆ స్థలాన్ని రాయిస్తాననీ.. నీకేం అభ్యంతరం లేదనీ! అవునా...? అదే నాక్కావలసింది...!'' అంటూ ఫోను ఆఫ్ చేసేసింది.

వంశీ నిర్లిప్తంగా ఆలోచనలో పడి చాలాసేపు అలానే కూర్చుండిపోయాడు.

* * *

కాలింగ్ బెల్ మోగిన చప్పుడూ, ఆ తర్వాత వెంటనే తలుపు తడుతున్న శబ్దమూ వెంటవెంటనే వినిపించటంతో వంశీ హడావుడిగా వెళ్ళి తలుపు తీశాడు.

అతను ఒక క్షణం ఉలిక్కిపడినట్లుగా నిర్ఘాంతపోయాడు.

ఎదురుగా ఓ ఇరవై ఏళ్ళ అందమైన అమ్మాయి నిలబడి ఉంది!

ఎవరిదో అడ్రసు కావాలని అడగటానికి తమంటికి వచ్చి ఉండొచ్చనే భావంతో వంశీ ''ఎ...వరు... ఎవరు కావాలండీ...?'' అనడిగాడు.

ఆ అమ్మాయి చిరునవ్వు నవ్వింది.

''నన్ను... మీరు గుర్తుపట్టలేదా...?'' అనటంతో వంశీ ఆశ్చర్యంగా ఆమెవైపు పరిశీలనగా చూసి... లేదన్నట్లు తలవూపాడు.

ఆమె నిట్టూర్చింది. ''అయితే... ఒక చిన్న క్లూ ఇస్తాను. ఒక పెళ్ళిలో నన్నుచూసి ఉండొచ్చు! మీ ఆలోచనలకు పదును పెట్టండి...'' అంటూ మళ్ళీ చిరునవ్వు చిందించింది.

వంశీ బాగా ఆలోచించాడు.

''అంటే... మా అనూష పెళ్ళిలో మిమ్మల్ని చూసానని అనిపిస్తోంది! నిజమేగా?'' అనడిగాడు.

''హమ్మయ్య...! ఫరవాలేదు, ఎలాగో గుర్తుపట్టారు!'' అంది ఆ అమ్మాయి నిట్టూరుస్తూ.

"అవునూ.. మీ పేరు... తి... తి... తిలోత్తమ కదండీ...?'' ఆసక్తిగా చూస్తూ అన్నాడు వంశీ.

''అవునుగానీ, తి..తి...తిలోత్తమ కాదు. తిలోత్తమ మాత్రమే...! కొందరు నా పేరుకు ముందు ఓ బిరుదు తగిలించారు. అది గుర్తుకు వచ్చి అలా అనబోయి ఆగిపోయినట్లున్నారు! అవునా...?''

''అదేం లేదు... గుర్తకు తెచ్చుకోవటంలో కొంచెం తడబడ్డాను! అంతే...!'' అన్నాడు వంశీ.

ఆమె పట్టి పట్టి అతనివైపు చూసిందో క్షణం. తర్వాత లోపలికి వచ్చి కూర్చుంది. సోఫాలో కూర్చున్న ఆమె, తన కాళ్ళ ముందున్న టీపాయిని కాళ్ళతో తన్నుతూ ''ఇదెందుకూ... ఇక్కడ పెట్టారు అడ్డంగా. ఆ మూల ఉంటేనే బావుంటుంది...!'' అంది.

ఆ తర్వాత లేచి నిలబడి ''ఈ సోఫా సెట్టు ఇటువైపు బాగా లేదు. ఎవరైనా మనుష్యుల్ని పిలిపించి ఆ వైపుకి సర్దించండి. ఈ ఫ్లవర్ వాజ్ కూడా ఇక్కడ వద్దు... ఆ పక్కన పెడతాను...!'' అంటూ చొరవగా తనే

పెట్టేస్తోంటే, వంశీ కొంచెం గొంతు సవరించుకుని మెల్లగా అన్నాడు'' అవన్నీ అలాగే ఉంచాలి. మార్పులేం వద్దు. అమ్మ తనకి నచ్చినట్లుగా సర్దింది. అలాగే ఉండనిద్దాం.''

ఆ అమ్మాయి వంశీపైపు చురుగ్గా చూసింది.

''నేనిక్కడ కొన్నాళ్ళు ఉంటాను! అందుకని అన్నీ నేను చెప్పినట్లే జరగాలి! అందరూ నా మాటే వినాలి, తప్ప నేనెవ్వరి మాట వినను!'' ఖచ్చితమన్నట్లు ఆమె చెప్పేసరికి వంశీ విస్తుపోయినట్లు చూసాడు.

''మీ మాటలు నాకేం అర్థం కావటంలేదు. మీరు మా చెల్లెలు అనూషకు ఆడబడుచు కావచ్చను. కానీ... ఈ ఇంట్లో మాత్రం ఏవైనా మా అమ్మ అభిరుచి, ఇష్టం ప్రకారం జరుగుతాయి! మీరు కొన్నాళ్ళు ఎందుకు ఉండాలని అనుకుంటుంన్నారూ... వస్తువులన్నీ మీ ఇష్టప్రకారం సర్దాల్సిన అవసరం ఏమిటీ... నాకేం అర్థం కావటం లేదు!''

వంశీ నిష్కర్షగా చెప్పిన  మాటలకు ఆ అమ్మాయి పెద్దగా నవ్వింది.

''ఇప్పటికైనా... నాకు మా వాళ్ళు అందరూ కలిసిచ్చిన బిరుదు మీకు గుర్తు చేయటానికే ఇలా మాట్లాడాను. అర్థమైందిగా... ఇపుడు చెప్పండి... నా పూర్తి పేరు ఏమిటీ...?''

వంశీ పెదవులపైన చిన్న చిరునవ్వు వచ్చింది.

''టి. తిలోత్తమ. అంతేగా...?''

" అది నిజమే గానీ... అంతా అనేది అది కాదుగా, మీకూ తెలుసు. 'తిక్క తిలోత్తమ'గా దాన్ని మార్చారు...! నా తిక్క మాటలు, పనులు చూసి మీకు గుర్తుకు వచ్చి అదే అంటారని అనుకున్నా... కానీ మీకు గుర్తువచ్చినా చాలా నిగ్రహం చూపించారు! బహుశా మొహమాట పడ్డారు.. అవునా...?''

ఈసారి తిలోత్తమ మాటలకు వంశీ ఆశ్చర్యపోయాడు.

చాలా చిత్రమైన మనిషిలా ఉందే అనుకున్నాడు.

''నిజమే మీరు చెప్పింది. మిమ్మల్ని అందరూ 'తిక్క తిలోత్తమ' అంటారని నాకూ గుర్తుకు వచ్చింది!'' అన్నాడు వంశీ చిరునవ్వుతో.

తిలోత్తమ కూడా చిన్నగా నవ్వింది.

''చిన్నపుడు అన్నీ నా ఇష్టం ప్రకారం జరగాలంటూ తిక్క తిక్కగా మాట్లాడేదాన్నట. అందుకని... ఎవరో ఒకసారి ఇలా 'తిక్క తిలోత్తమ' అని అనటంతో అదే పేరు బాగా ప్రాచుర్యంలోకి వచ్చేసిందని మావాళ్ళు అంటూ ఉంటారు.''

''అది సరే... మీరిక్కడ కొన్నాళ్ళు ఉండాలనుకుంటున్నట్లు చెప్పారు. ఏమైనా పని ఉందా.?'' వంశీ తన సందేహం బయటపెట్టాడు.

తిలోత్తమ నిట్టూర్చింది... ''పనంటే.... నాకు ప్రత్యేకంగా ఏమిలేదు గానీ... మీ అమ్మగారు అక్కడ డాక్టరుగారి దగ్గర... వాళ్ళింట్లో ట్రీట్ మెంటు కోసం ఉంటున్నారట కదా, ఇంట్లో మీరొక్కరు ఉంటున్నారు కాబట్టి... మా వదిన అంటే... మీ చెల్లెలు మిమ్మల్ని కొన్నాళ్లు చూసుకోమని చెప్పి, పంపింది... అంటూ ముసిముసి నవ్వులు చిందించింది.

వంశీ అమాయకంగా చూసాడు.